

పెనుకొండ మండలం సత్తార్లపల్లి వద్ద కోత సమయంలో భారీ వర్షానికి కొట్టుకుపోయిన ఉల్లి పంట (ఫైల్)

కనికరం లభించేనా?

ఖరీఫ్‌లో జిల్లా అంతటా పంటలు చేతికి రాకున్నా.. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో నిరాశే ఎదురైంది. 22 మండలాలకు చోటు దక్కలేదు. అక్టోబరులో ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో తీవ్ర కరువు మండలాలుగా తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపులకు చోటు కల్పించింది. కనగానిపల్లి, ధర్మవరం, నంబులపూలకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను పాక్షిక కరువు మండలాల జాబితాలో చేర్చింది. జిల్లాలోని 32 మండలాల్లోనూ పంటలు దెబ్బతింటే పదింటినే జాబితాలో చేర్చడంపై మిగతా ప్రాంతాలవారు ఆవేదన చెందుతున్నారు. తీవ్రంగా నష్టపోయామనీ, ఆదుకోవాలని జిల్లాలో పర్యటించే కరువు బృందానికి విన్నవించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

చేతికొచ్చిన పంటలు వర్షార్పణం

జిల్లావ్యాప్తంగా గతేడాది అక్టోబరు 15 నుంచి వారంరోజులపాటు అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాల్లింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంట చేతికొచ్చిన వరి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, పత్తి, టమోటా, అరటి, బంతిపూలు, మిర్చి, ద్రాక్ష, ఉల్లి, చిక్కుడు, వంగ తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ప్రాథమిక అంచనా ప్రకారం కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి, హిందూపురం, లేపాక్షి, తాడిమర్రి, బుక్కపట్నం, ముదిగుబ్బతోపాటు అన్ని మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు 1400 హెక్టార్లకుపైగా నష్టం వాటిల్లింది.



నంబులపూలకుంట మండలంలో వర్షానికి తడిసిపోయిన వేరుశనగ కట్టెను చూపిన రైతు (ఫైల్)

- ఖరీఫ్‌లో ఎండిపోయిన పంటలు
- తొలగించుకున్న రైతులు
- పెట్టుబడి మట్టిపాలు
- జిల్లా అంతటా నష్టం
- కరువు జాబితాలో దక్కనిచోటు
- అన్నదాత ఆవేదన
- ఆదుకోవాలంటూ రైతుల వేడుకోలు



తాడిమర్రి మండలం మద్దల చెరువు వద్ద ఎండిన వేరుశనగ పంటను తొలగిస్తున్న కూలీలు (ఫైల్)

జిల్లా రైతుకు
ఏటా అప్పులే మిగులుతున్నాయి..
మరిన్ని అప్పులు చేసి..
గత ఖరీఫ్‌లో పంటలు పెట్టాడు..
వర్షాభావం వెంటాడింది..
చినుకు జాడలేక..
పంటలు నిలువునా
ఎండిపోయాయి..
చేసేదిలేక తొలగించుకున్నాడు..
మళ్లీ పెట్టుబడి నష్టపోయాడు..
ఖరీఫ్ కన్నీళ్లే మిగిల్చింది..
ప్రభుత్వం సాయం చేస్తేనే..
వ్యవసాయం
చేయగలమంటున్నాడు..

కన్నీళ్లు చూడండి..!

నేడు జిల్లాలో కరువు బృందం పర్యటన

పుట్టపర్తి, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం రైతన్నను దెబ్బతీసింది. అతివృష్టి, అనావృష్టితో ఐదేళ్లుగా పంటలు దక్కలేదు. రైతన్నలకు పెట్టుబడులు చేతికి అందక అప్పులే మిగులుతున్నాయి. అయినా.. అప్పోసప్పో చేసి గతేడాది ఖరీఫ్‌లో పంటలు పెట్టారు. వరుణదేవుడు ముఖం చాటేశాడు. దీంతో వర్షాధారంగా సాగుచేసిన వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, కంది, అలసంద, రాగి తదితర పంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో కొందరు రైతులు పంటలను తొలగించుకున్నారు. మరికొందరు పొలంలోనే వదిలేశారు. కాస్తో.. కూస్తో.. పండిన పంటలకు కోతల సమయంలో వరుస వర్షాలతో నష్టం వాటిల్లింది. ఉద్యాన, మల్బరీ పంటల పరిస్థితి కూడా అంతే. ఇలా.. ఖరీఫ్‌లో 90 శాతంపైగా పంటను రైతన్నలు నష్టపోయారు. జిల్లాలో వివిధ అంశాల ప్రాతిపదికన ప్రభుత్వం కరువు మండలాల జాబితాను ప్రకటించింది. అందులో మూడు మండలాలను తీవ్ర, ఏడింటిని పాక్షిక మండలాలుగా ప్రకటించింది. దీంతో మిగిలిన 22 మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కరువు బృందం బుధవారం జిల్లాలో పర్యటించనుంది. కేంద్ర కరువు బృందమైనా ఉపశమనం కల్పిస్తుందా అని రైతాంగం ఎదురుచూస్తోంది.



పెట్టుబడీ పాయె..

జిల్లాలో వర్షాధారంగా అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 2.44 లక్షల హెక్టార్లు. గత ఖరీఫ్ ప్రారంభం నుంచే వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. దీంతో 1.49 లక్షల హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. అప్పోసప్పో చేసి రూ.వందల కోట్ల పెట్టుబడులు పెట్టారు. వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, ఆముదం, పెసర, ఉలవ, అలసంద, జొన్న, సజ్జ, పప్పుశనగ పంటలు ఎండిపోయి, తీవ్ర నష్టం వాటిల్లింది. నీటి వనరుల కింద సాగు చేసిన వరి పంట కూడా దెబ్బతింది. వేరుశగన, మొక్కజొన్న, పత్తి పంటలు చేలోనే ఎండిపోగా.. చాలాచోట్ల వదిలేశారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 45,845 హెక్టార్లలో పంటలు దెబ్బతిని రూ.62.46 కోట్ల నష్టం వాటిల్లిందనీ, పరిహారం ఇవ్వాలని వ్యవసాయ శాఖ.. ప్రభుత్వానికి నివేదించింది.

నేడు కేంద్ర కరువు బృందం పర్యటన

జిల్లాలో గత ఖరీఫ్‌లో పంట నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం బుధవారం పర్యటించనుంది. జిల్లాలో కరువు పరిస్థితులపై పుట్టపర్తిలో ఉదయం జిల్లా అధికారులతో కరువు బృందం సభ్యులు సమీక్షిస్తారు. ప్రశాంతి నిలయం నుంచి 9 గంటలకు బయలుదేరి ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లికి పది గంటలకు చేరుకుంటారు. కంది పంటను పరిశీలిస్తారు. వేరుశనగ రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. తాడిమర్రి మండలం రామాపురం గ్రామం వద్ద జొన్న, ఉలవ పంటలను కోల్పోయిన రైతులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 2 గంటలకు తాడిమర్రి రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లాలో కరువు ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తారు. అక్కడి నుంచి అనంతపురం జిల్లా పర్యటనకు తరలి వెళ్తారు.

లెస్ చార్జీలు..!

సంక్షేమ వసతి గృహాలపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు

ఐదేళ్లూ మెస్ చార్జీలు పెంచని వైనం

ఆ ధరలకు సరుకులు సరఫరా చేయని కాంట్రాక్టర్లు

అప్పులు చేసి.. విద్యార్థులకు వండిపెడుతున్న వార్డెన్లు



కొత్తచెరువు బీసీ వసతిగృహం



ధర్మవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై చిన్న చూపు చూపింది. హాస్టళ్ల నిర్వహణను గాలికొదిలేసింది. కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా మెస్ చార్జీలు పెంచలేదు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో ఐదేళ్ల క్రితం ధరలతో నిత్యావసర సరుకులు సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదు. దీంతో విద్యార్థులను పస్తులు పెట్టలేక వార్డెన్లు జీతాల డబ్బులతో భోజనాలు పెడుతున్నట్లు తెలుస్తోంది. అవి కూడా చాలక బయట అప్పులు తెచ్చి, అన్నం పెడుతున్నారు. ఇవి చాలవన్నట్లు గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మెస్‌చార్జీలు మంజూరు కాలేదు. దీంతో వసతి గృహాల వార్డెన్లకు అప్పుల తిప్పలు రెట్టింపయ్యాయి. జిల్లావ్యాప్తంగా సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాలు 52 ఉన్నాయి. వీటిలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలురు 3596, బాలికలు 820 మంది ఉన్నారు. వీరికి ఇప్పటి వరకు మెస్‌చార్జీలు రూ.2.13 కోట్ల బకాయిలున్నాయి. జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలురు 657, బాలికలు 515 మంది ఉన్నారు. వీరికి సంబంధించి రూ.81.84 లక్షల మెస్ చార్జీల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. గత వైసీపీ పాలకులు వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతూ, చదువులు చెబుతామని గొప్పలు చెప్పారు. చదువుల సంగతి దేవుడెరుగు కనీసం వాటి నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో సంక్షేమ హాస్టళ్లను కష్టాలు చుట్టుముట్టాయి. కూటమి ప్రభుత్వమైనా పేరుకుపోయిన 7 నెలల మెస్‌చార్జీలు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హాస్టళ్లకు బియ్యం మాత్రమే సరఫరా

సంక్షేమ హాస్టళ్లకు ప్రభుత్వం బియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. గ్యాస్‌తోపాటు నిత్యవసర సరుకులు బయట కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధరలు తక్కువగా ఉన్నపుడు కాంట్రాక్టర్లు పెద్దఎత్తున సరఫరా చేస్తున్నారు. ధరలు పెరిగితే సరఫరా నిలిపివేస్తున్నారు. పాలు, గుడ్లు, మాంసం, అరటిపండ్లు, బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. చిక్కీలు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఐదేళ్ల క్రితం ఉన్న ధరలకు అనుగుణంగానే నేటికీ మెస్ బిల్లులు చెలిస్తున్నారు. కోడిగుడ్డు అప్పట్లో రూ.4 ధర ఉండగా.. ప్రస్తుతం రూ.7 వరకు పలుకుతోంది. ప్రభుత్వం మాత్రం రూ.4 లెక్కన చెల్లిస్తోంది.ఒకవైపు ధరలు భారీగా పెరగడం, అందుకనుగుణంగా చార్జీలు పెంచకపోవడం, బిల్లుల చెల్లింపులో నెలల తరబడి ఆలస్యం చేస్తుండడంతో నిర్వహణ భారంగా మారింది. హాస్టళ్లలో స్టేషనరీ కూడా ఉండట్లేదు. కనీస వసతులు కరువయ్యాయి. తాగునీరు కూడా ఉండట్లేదని తెలుస్తోంది. జిల్లాలో దాదాపు అన్ని హాస్టళ్లలో ఇదే పరిస్థితి నెలకొంది.

వార్డెన్ల తిప్పలు

ప్రభుత్వం సకాలంలో మెస్ బిల్లులు చెల్లించకపోవడం, ధరలకు అనుగుణంగా పెంచకపోవడంతో హాస్టళ్ల వార్డెన్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్లు సరుకులు సరఫరా చేయకపోవడంతో వార్డెన్లు భరించాల్సి వస్తోంది. 7 నెలలుగా జీతాల సొమ్ముతో విద్యార్థులకు భోజనాలు పెడుతున్నట్లు వార్డెన్లు వాపోతున్నారు. ఆ డబ్బులు కూడా చాలక బయట వడ్డీలకు అప్పులు తెచ్చి, విద్యార్థుల కడుపు నింపుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

హాస్టళ్ల మెస్ చార్జీలకు నిధుల మంజూరు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే.. బిల్లుల సొమ్ము వార్డెన్ల ఖాతాలకు జమచేస్తాం.

- వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమాధికారి, శ్రీసత్యసాయి జిల్లా

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్

పుట్టపర్తిరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి చెట్లకు పూత వస్తుండడంతో సరైన సస్యరక్షణ చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. బుక్కపట్నం మండలం గూనిపల్లి సమీపాన మామిడి పంటను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మామిడితోటలు ప్రస్తుతం పూత వచ్చే దశలో ఉన్నాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పది శాతం కూడా పూతరాని తోటలకు ఒక నీటి తడి ఇవ్వాలన్నారు. పూత, మొగ్గలు ఒకేసారి రావడానికి 13:0:45, 7 గ్రాములు ప్లస్, ఏదేని సూక్ష్మధాతువు 2 గ్రాముల నుంచి 3 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. 25శాతం పూత వచ్చిన తోటలో ఒకతడి ఇచ్చి బ్రాసినోలిడ్ 1 ఎంఎల్ ప్లస్ ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ ప్లస్ హెక్సాజోనల్ 2 ఎం.ఎల్. లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. 50శాతం పూత వచ్చిన తోటల్లో ప్లానోపాస్ 0.3 ఎంఎల్ ప్లస్ థియోమిథాక్సిన్ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. 75 శాతం నుంచి 100 శాతం పూతవచ్చిన, 10 శాతం పిందె ఏర్పడితన తోటల్లో స్పైనోసార్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు.



మామిడిపూతను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

పండు ఈగ నివారణకు చర్యలు

పండు ఈగ నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ సూచించారు. ఈగను ఆకర్షించే బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పండు ఈగను నియంత్రిస్తే పంటను కాపాడుకోవచ్చని ఆయన వివరించారు.

కూటమి పాలనలో తప్పిన వేతన వెతలు

108 కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్



108 కార్యవర్గ సభ్యులతో కిరణ్‌కుమార్

కొత్తచెరువు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వేతనాల కోసం నెలల తరబడి వేచిచూడాల్సి వచ్చేదనీ, కూటమి ప్రభుత్వంలో ఆ వెతలు తప్పాయని 108 సర్వీసు కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో 108 సిబ్బందికి జీతాలు పది నెలలకోసారి ఇచ్చిన సందర్భాలున్నాయన్నారు. కూటమి పాలనలో ఆ సమస్య తీరిందన్నారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాలా వెంకటేశ్వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునానరు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పీవీ నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీనివాసరాజు హాజరయ్యారు.

కొరమీను చేపలతో ఆదాయం

ఆక్వా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు

డీఆర్‌డీఏ పీడీ నరసయ్య



కరపత్రాలను విడుదల చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ

తాడిమర్రి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొరమీను చేపలు పెంచడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆక్వా యూనిట్‌పై అవగాహన కార్యకమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ... ఎకరం భూమి, నీరు సమృద్ధిగా ఉన్న మహిళా రైతులు.. అక్వాయూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఏడాదిలో మూడు పంటలతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఆసక్తిగల రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు సైతం ఇప్పిస్తామని ఆయన వివరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆక్వా యూనిట్ ఎండీ ఉదయ్‌కిషన్, డీపీఎం రామ్మోహన్, మహిళా రైతులు పాల్గొన్నారు.

నేడు సాయి కాళేశ్వర్ జయంతి



పెనుకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, షిర్డీసాయి గ్లోబల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి కాళేశ్వర్ 52వ జయంతిని బుధవారం స్థానిక శివసాయి మందిర ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, హరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. దేశ, విదేశీభక్తులు పాల్గొంటారన్నారు. శివసాయి మందిరం ప్రాంగణంలోని వైద్యశాలలో బుధవారం నుంచి ఐదురోజులపాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, చర్మ సంబంధ వ్యాధులు, పంటినొప్పి సమస్యలకు, కండరాలు, కీళ్ల నొప్పులు, వినికిడి సమస్య ఉన్న వారికి ప్రముఖ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మందులు అందజేస్తారన్నారు. ఆయా తేదీల్లో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. వినికిడిలోపం ఉన్న వారు ఆధార్, రేషన్‌కార్డులు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. అవసరమైన వారికి వినికిడి పరికరాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తులకు సిద్ధం కండి

స్వయం ఉపాధికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు...

త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

6

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింకకు గాయాలు

ఓబుళదేవరచెరువు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళదేవరచెరువు-కొండకమర్ల రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక గాయపడింది. మంగళవారం ఉదయాన్నే పొలాలకెళ్లిన మామిళ్లకుంటపల్లికి చెందిన రైతు బాలకృష్ణారెడ్డి జింకను గుర్తించి, ప్రథమ చికిత్స చేయించాడు. అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రామకృష్ణకు సమాచారం అందించారు. ఆయన గాయపడిన జింకను ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి, పుట్టపర్తి కరుణ సొసైటీకి అప్పగించారు.

DHARMAVARAM MUNICIPALITY

IFB Tender Notice No.493,508 to 510/General Funds/2024-25/E1.

'e' procurement Tender Notice No. 493, 508 TO 510/ General Funds / 2024 - 2025/ E1 under General Funds 2024-25 With value of work Rs. 2.50 Lakhs to Rs. 17.00 Lakhs Details of name of work, Tender document, Eligibility Criteria, Bid Submission & Price bid opening date and EMD details etc., may be seen on 'e'procurement website -https:// tender.apeprocurement.gov.in.

Commissioner,
Dharmavaram Municipality.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గోరంట్ల శాఖ, శ్రీ సత్యసాయి జిల్లా

A/C No.s.1) 62320351363 (Home Loan), 2) 62456383662 (Home Cash Loan), 3). A/C No. 62405055620 (CC/L)

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

అనుబంధం చట్టం IV క్రింద- నిబంధన 8(1) మరియు (2)

క్రింది సంతకందారుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,గోరంట్ల శాఖ, శ్రీ సత్యసాయి జిల్లా కు అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 3తో చదువుకొనేలా సెక్షన్ 13(2) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని రుణగ్రస్తులగు **శ్రీ ముఖందర్ సమీవుల్ల, తండ్రి: ఎమ్. ఇబ్రహీం సాబ్, డోర్.నెం.4-1123, జామియ మసీదు వీధి, గోరంట్ల, శ్రీ సత్యసాయి జిల్లా, సహ ఋణగ్రహీత: శ్రీమతి ముఖందర్ మల్లిక, భర్త: ముఖందర్ సమీవుల్ల, డోర్.నెం.4-1123, జామియ మసీదు వీధి, గోరంట్ల, శ్రీ సత్యసాయి జిల్లా, ఋణగ్రహీత: మెసర్స్ ఫరూక్ ట్రేడర్స్, ప్రొ॥ ముఖందర్ సమీవుల్ల, డోర్.నెం.3-477-7, మెయిన్ రోడ్డు, గోరంట్ల, శ్రీ సత్యసాయి జిల్లా, గ్యారంటారు: శ్రీమతి ఎమ్. మకందర్ మల్లిక, భర్త: ఎమ్. సమీవుల్ల డోర్.నెం.3-477-7, మెయిన్ రోడ్డు, గోరంట్ల, శ్రీ సత్యసాయి జిల్లా** వారికి **తేదీ.13/09/2024** నాటి డిమాండు నోటీసులో వివరించిన బకాయిలు మొత్తం 1. **తేది.13.09.2024** నాటికి **రూ॥8,60,473/- (రూపాయలు ఎనిమిది లక్షల అరవై వేల నాలుగు వందల డెబ్బై మూడు మాత్రమే) 2. తేది.13.09.2024 నాటికిరూ॥3,41,337/- (రూపాయలు మూడు లక్షల నలభై ఒక్క వేయి మూడు వందల ముప్పై ఏడు మాత్రమే) 3. తేది.13.09.2024 నాటికి రూ॥2,87,550/-లు (అక్షరాల రెండు లక్షల ఎనభై ఏడు వేల ఐదు వందల యాభై మాత్రమే)** తిరిగి చెల్లించవలసినదిగా **నోటీసు ఇవ్వడమైనది.** మీరు **14/09/2024** నుంచి గల భవిష్య వడ్డీ మొత్తాన్ని మరియు సంభవించే ఖర్చులు, కాస్ట్‌లు, ఛార్జీలు మొ॥లగు వాటిని కూడా సదరు నోటీసు ఇచ్చిన తేది నుంచి గల 60 రోజులలోగా చెల్లించవల్సిందిగా తెలియజేయడమైనది.

ఋణగ్రస్తుడు/గ్యారంటారు **తేది.16.10.2024వ తేదీన ఇంటి ఋణ అకౌంట్ నెం.62320351363కు రూ॥31,000/-, 2,000/-, తేది.06.10.2024వ తేదీన ఇంటి క్యాష్‌లోన్ అకౌంట్ నెం.62456383662కు రూ॥1000/-, తేదీ.16.10.2024వ తేదీన రూ॥28,944.80 మరియు రూ॥20,000/-** చెల్లించడము జరిగినది, **క్యాష్ క్రెడిట్ లోన్ అకౌంట్ నెం.62405055620కు చెల్లించలేదు.** కాని డిమాండు నోటీసు నందు తెల్పిన మొత్తము బకాయి చెల్లించలేదు. అందువల్ల క్రింది సంతకందారుడు దిగువ వివరించిన ఆస్తిని, సదరు నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు ఆస్తిని **తేది.02.01.2025న** నిర్థయాత్మక స్వాధీనం చేసుకున్నారని రుణగ్రస్తుడు/గ్యారంటారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం జరుపరాదని, ఒకవేళ ఎవ్వరైన సదరు ఆస్తి తో వ్యవహారం జరిపినచో **భారతీయ స్టేట్ బ్యాంక్, గోరంట్ల శాఖ, శ్రీ సత్య సాయి జిల్లా** వారి **బకాయి మొత్తం తేది.02.01.2025 నాటికి 1) రూ॥ 8,59,359 (అక్షరాల ఎనిమిది లక్షల యాభై తొమ్మిది వేల మూడు వందల యాభై తొమ్మిది మాత్రమే) 2. తేది.02.01.2025 తేది నాటికి రూ॥3,00,223/- (అక్షరాల మూడు లక్షల రెండు వందల ఇరవై మూడు మాత్రమే) 3. తేది.02.01.2025 నాటికి రూ॥2,99,156/- (అక్షరాల రెండు లక్షల తొంభై తొమ్మిది వేల నూటా యాభై ఆరు మాత్రమే)** మరియు ఒప్పంద రేటు ప్రకారం గల భవిష్య వడ్డీ మరియు ఖర్చులు, కాస్ట్‌లు, ఛార్జీలు మొ॥ వాటిపై తీసుకోనున్న చర్యలకు బాధ్యులగుదురని ముఖ్యంగా రుణగ్రస్తుడు/ గ్యారంటార్లు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియచేయడమైనది.

స్థిరాస్తుల వివరములు

ఐటమ్ నెం.1:
హిందూపురము ఆర్.డి , చిలమత్తూరు ఎస్.ఆర్.డి, గోరంట్ల గ్రామ పంచాయితి లిమిట్స్,3వ వార్డు, డోర్.నెం.3-71 నందు ఉన్న ఇంటి యావదాస్తి. ఈ ఆస్తి శ్రీమతి ముఖందర్ మల్లిక, భర్త: సమీవుల్లకు చెందినది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం.2842/2011, తేది. 28.10.2011, ప్రభుత్వ డ్రై, సర్వే నెం.259-1బి2. మొత్తము స్థలము కొలతలు: తూర్పు-పడమర: 47 అడుగులు లేదా 14.335 మీటర్లు, ఉత్తరము-దక్షిణము:11.1 అడుగులు లేదా 3.385 మీటర్లు, ఇంటి కొలతలు: తూర్పు-పడమర:42 అడుగులు లేదా 12.810 మీటర్లు, ఉత్తరము-దక్షిణము: 8.1 అడుగులు లేదా 2.470 మీటర్లు, దీనికి హద్దులు: తూర్పు: పంచాయితి రోడ్డు, పడమర: అల్లాబకాష్ ఇల్లు మరియు సందు, ఉత్తరము: జామ్మ మసీదుకు చెందిన ఖాళీ స్థలము, దక్షిణము: అప్లికెంట్‌కు చెందిన ఇల్లు.

ఐటమ్ నెం.2:
హిందూపురము ఆర్.డి , చిలమత్తూరు ఎస్.ఆర్.డి, గోరంట్ల గ్రామ పంచాయితి లిమిట్స్,3వ వార్డు, డోర్.నెం.3-72 నందు ఉన్న ఇంటి యావదాస్తి. ఈ ఆస్తి శ్రీమతి ముఖందర్ మల్లిక, భర్త: సమీవుల్లకు చెందినది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం.2843/2011, తేది. 28.10.2011, ప్రభుత్వ డ్రై, సర్వే నెం.259-1బి2. మొత్తము స్థలము కొలతలు: తూర్పు-పడమర:47 అడుగులు లేదా 14.335 మీటర్లు, ఉత్తరము-దక్షిణము:8.1 అడుగులు లేదా 2.470 మీటర్లు, ఇంటి కొలతలు: తూర్పు-పడమర:42 అడుగులు లేదా 12.810మీటర్లు, ఉత్తరము-దక్షిణము: 8.1 అడుగులు లేదా 2.470 మీటర్లు, దీనికి హద్దులు: తూర్పు: పంచాయితి రోడ్డు, పడమర: అల్లాబకాష్ ఇల్లు మరియు సందు, ఉత్తరము: అప్లికెంట్‌కు చెందిన ఇల్లు, దక్షిణము:డోర్ నెం.3-70 నందు శివయ్యకు చెందిన ఇల్లు.

తేది: 02.01.2025 — **సం/- అధీకృత అధికారి,**
స్థలము: గోరంట్ల శాఖ. — **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.**



శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీ మజరా.. అలంకరాయునిపేట. సుమారు వంద కుటుంబాలు, ఐదొందల జనాభా ఉండే చిన్న ఊరు ఇది. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి కనీస మౌలిక వసతులు లేక ఈ ఊరి జనం ఇబ్బంది పడుతున్నారు. వాటి పరిష్కారం కోసం స్వయంగా ఓ ఎమ్మెల్యే.. మరో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం సమర్పించారు. మడకశిర ఎమ్మెల్యే స్వగ్రామం ఈ ఊరు. కానీ శింగనమల పరిధిలో ఉంది. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. ఎమ్మెల్యే బండారు శ్రావణిని డివిజన్ స్థాయి గ్రీవెన్స్‌లో సోమవారం కలిశారు. తన సొంతూరి కష్టాలను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే శ్రావణికి వివరించారు. ఈ నేపథ్యంలో ఆ ఊరిని ఆంధ్రజ్యోతి మంగళవారం సందర్శించింది. అక్కడి ప్రజలతో మాట్లాడి.. ఊరి పరిస్థితిని తెలుసుకుంది.

- ఆంధ్రజ్యోతి, శింగనమల





అలంకరాయునిపేట ఊరు ముఖచిత్రం

ఆంధ్రజ్యోతి విజిట్

అవస్థలే అలంకరణ

వంక దాటితేనే చదువులు

వర్షం కురిస్తే ఇళ్లలోకి కొండ నీరు

అభివృద్ధికి దూరంగా అలంకరాయునిపేట

సొంతూరి కష్టాలపై కదిలిన

మడకశిర ఎమ్మెల్యే

తాగునీటికి పొలం బాట.. ఇళ్ల ముందు మురుగునీరు..

వ్యవసాయమే జీవనాధారం

అలంకరాయునిపేటలో రైతులు, రైతు కూలీల కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయమే ఈ ఊరి ప్రజల ప్రధాన జీవనాధారం. బోరుబావుల కింద చీనీ తోటలను సాగు చేశారు. దీంతోపాటు వరి సాగు చేస్తున్నారు. ఊరి పేరులో అలంకారం ఉన్నా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరే అలంకారంగా మారింది. వేసవిలో కాస్త పరవాలేదుగానీ, వర్షాకాలంలో మురుగునీరు, వర్షపునీరు చేరి పరిస్థితి దారుణంగా తయారౌతుంది. ఇంట్లోంచి కాలు బయట పెడితే బురదలో నడవాల్సిందే. సీసీ రోడ్లు వేసే సమయంలో డ్రైనేజీ కాలువలను నిర్మించకపోవడమే దీనికి కారణం. దీనికితోడు వర్షం కురిస్తే కొండపై నుంచి నేరుగా ఊరిలోకి వస్తుంది. గతంలో కాలువలు ఉండేవని, కానీ పూడిపోయాయని ఊరి జనం అంటున్నారు. కొండమీది నుంచి వచ్చే నీటితో ఇబ్బంది తలెత్తకుండా గ్రామస్థులే మట్టితో అడ్డుకట్ట వేశారు. అయినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు.



ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇల్లు

కష్టంగా చదువులు

ఎంఎస్ రాజు సొంతూరులో గతంలో ఐదో తరగతి వరకూ చదువు అందుబాటులో ఉండేది. వైసీపీ హయాంలో మూడో తరగతికి పరిమితం చేశారు. పాఠశాలలో రెండు గదులు ఉన్నాయి. ఒకటి శిథిలావస్థకు చేరడంతో మరో గదిలో సర్దుకుంటున్నారు. బడి భవంతికి అనుకుని పేడ దిబ్బలు వేశారు. దీంతో కంపు కొడుతోంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవంతిలో నిర్వహిస్తున్నారు. సొంత భవనం లేదు. మూడో తరగతి దాటాక ఇంకా చదవాలంటే ఊరు దాటాల్సిందే. ఈ ఊరికి 5 కి.మీ. దూరంలో ఉన్న సలకంచెరువులో జడ్పీ పాఠశాల ఉంది. ఆ బడికి పోవాలంటే చీలేపల్లి సమీపంలోని కూతలేరు వంక దాటాలి. వర్షాకాలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. పెద్దలకే ఇబ్బంది. అలాంటిది బడిపిల్లలు వెళ్లడం సాహసమే. ఈ కారణంగా కొందరు చదువులకు దూరమయ్యారు.



ఇరుకు గదిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

రోగాలబారిన పడుతున్నాం..



మాది చిన్న గ్రామం. ఎన్నేళ్లు గడిచినా అభివృద్ధి జరగలేదు. సరైన రోడ్లు లేవు. మురుగునీటి కాలువలు లేవు. అపరిశుభ్ర వాతావరణంతో రోగాలబారిన పడుతున్నాము. అధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

-నారాయణస్వామి

తాగునీరు ఇవ్వాలి..



మా ఊరికి 40 ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు వేసి, ట్యాంకు నిర్మించారు. పైపులు పగిలిపోయాయి. గ్రామంలో పారే మురుగునీరు పైపుల్లోకి చేరుతోంది. నీరు కలుషితమై పశువులు కూడా తాగడం లేదు. అధికారులు కొత్త బోర్లు, పైప్‌లైన్‌లు వేయాలి. మాకు మంచి నీటిని సరాఫరా చేయాలి.

-ఆదిశేషారెడ్డి

బ్రిడ్జి కట్టండి..



మా ఊరి పిల్లలు బడికి వెళ్లాలంటే వంక దాటాలి. మా పొలాలు కూడా అక్కడే ఉన్నాయి. వర్షాకాలంలో వంక ఉధృతంగా పారుతుంది. వంక దాటేందుకు చిన్న బ్రిడ్జిని నిర్మించాలి. లేదంటే చిన్నారులు చదువులకు దూరమౌతారు.


-వెంకటలక్ష్మి



ఆలంకరాయునిపేట నుంచి సలకంచెరువు పాఠశాలకు వెళ్లే దారిలో వంక

తాగునీటికి తంటాలు

ఊరిలో ఉప్పు నీరు వస్తుంది. ఇది పశువులు తాగేందుకూ పనికిరాదు. అందుకే గ్రామస్థులు వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తారు. పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చి పశువులకు తాపిస్తారు. తామూ వినియోగిస్తారు. కూతలేరు వంకలో పంచాయతీ బోరు బావి ఉంది. అక్కడి నుంచి గ్రామానికి తాగునీటి పైప్‌లైన్ వేశారు. కానీ నాలుగు దశాబ్దాల క్రితం నాటివి కావడంతో దెబ్బతిన్నాయి. ఈ కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతోంది.





← పాత నీటి ట్యాంకు, గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న రోడ్డు ↑



ఓ ఇంటి ముందు మురుగునీరు

మా రాజుపై నమ్మకం ఉంది...



మా గ్రామానికి చెందిన ఎంఎస్ రాజు మడకశిర ఎమ్మెల్యేగా ఉన్నారు. మా రాజుకు మా గ్రామ సమస్యలు తెలుసు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేతో మాట్లాడి అభివృద్ధికి బాటలు వేస్తారనే నమ్మకం ఉంది.

- నాగముని



రచ్చ కట్ట మీద పులిజీతం అడుతున్న గ్రామస్థులు

గోడ కట్టాలి...

వర్షాలు వస్తే భయం భయంగా ఉంటుంది. కొండ దిగువ ప్రాంతాలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుంది. తాత్కాలికంగా కొండకు మట్టి కట్ట వేసుకున్నాం. అధికారులు ఎమ్మెల్యేలు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి. కొండ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.



-కాంతమ్మ

దరఖాస్తులకు సిద్ధం కండి

సబ్సిడీ రుణాలు వచ్చేశాయోచ్

స్వయం ఉపాధికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ...

త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ ఏడాదికి బీసీ కేటగిరీలోని కులాల ఆధారంగా రుణాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం రుణాలకు సంబంధించి వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ స్కీమ్ కింద స్వయం ఉపాధి కోసం రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. ఇందులో లబ్ధిదారుడి వాటా కింద 50 శాతం సబ్సిడీ రానుంది. బ్యాంకుకు మిగతా 50 శాతం మొత్తాన్ని చెల్లించేలా ఆమోదం తెలిపారు. బీసీ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాదికి 1728 యూనిట్లకు గానూ రూ. 32.90 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 102 యూనిట్లకుగానూ 1.77 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 58 యూనిట్లకుగానూ రూ. 1.01 కోట్లు, రెడ్డి కార్పొరేషన్‌కు 29 యూనిట్లకుగానూ రూ.50 లక్షలు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 21 యూనిట్లకు రూ.36 లక్షలు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 14 యూనిట్లకు రూ.24 లక్షలు, క్షత్రియ కార్పొరేషన్‌కు ఒక యూనిట్‌కుగానూ రూ.2 లక్షలు నిధులు విడుదల చేశారు. జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ.8 లక్షలు రుణాలు అందించను న్నారు. వీరికి 50 శాతం సబ్సిడీ వర్తించనుంది. బీసీ కార్పొరేషన్ పరిధిలో 35 యూనిట్లకు రూ. 2.80 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 17 యూనిట్లకు గానూ రూ.1.36 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 9 యూనిట్లకుగానూ రూ.72 లక్షలు, రెడ్డి కార్పొరేషన్‌కు 5 యూనిట్లకుగానూ రూ.40 లక్షలు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు 6 యూనిట్లకుగానూ రూ. 48 లక్షలు నిధులు విడుదల చేశారు. ఈ రుణాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేందుకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ రూపొందించారు. ఈ వెబ్‌సైట్ త్వరలోనే అందుబాటులోకి రానుందని, తేదీని ప్రకటించేలోపు అర్హులైన ఆయా కేటగిరీల లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

టీఎన్‌ఏటీయూ జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగు నాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ అనంతపురం జిల్లా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం అనంతలక్ష్మి, ప్రధానకార్యదర్శి లక్ష్మీనరసమ్మ తెలిపారు. జిల్లాకు వచ్చిన వారు మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా మహిళా నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా వీణ, సభ్యులుగా రుక్మిణీదేవి, శ్యామల, జమున, అరుణ, గౌరవాధ్యక్షులుగా రమాదేవిని నియమించారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల్లో టీఎన్‌ఏటీయూ సభ్యత్వాలను ముమ్మరం చేయాలని సూచించారు. సభ్యత్వాల నమోదుకే అడ్‌హక్ కమిటీ వేస్తున్నా మని, సభ్యత్వాల ప్రక్రియ ముగిసిన తర్వాత జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలను తీసుకెళ్తామని వారు తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నేతలు

2016లో రూ. 4200 ఉన్న గౌరవ వేతనం టీఎన్‌ఏటీయూ పోరాటం వల్ల రూ. 10,500కి పెరిగిందని గుర్తుచేశారు. అంగన్‌వాడీల గ్రాట్యూటీ సమస్య పరిష్క రించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, మినీవర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేసే జీవోను విడుదలచేయాలని డిమాండ్ చేశారు.

బువ్వ కష్టాలకు చెక్

మైనార్టీ హాస్టల్‌లో మెనూ అమలుకు శ్రీకారం

సంక్రాంతి తరువాత విద్యార్థులకు భోజనం



మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అన్ని మైనార్టీ హాస్టళ్లల్లో మెనూ(భోజనం)ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులకు భోజన కష్టాలు తీరనున్నాయి. ఇన్నాళ్లు ప్రభుత్వం ఇచ్చే రూ.1600లతోనే నెలంతా ఇబ్బంది పడుతూ ఆకలి తీర్చుకుంటున్న విద్యార్థులకు ఆ బాధలు తప్పనున్నాయి. ఇక మీదట వసతి గృహాల్లోనే విద్యార్థులకు భోజనం పెట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలోనే ఆ శాఖ రాష్ట్ర అధికారులు వంట సామగ్రి తదితర వాటికి సంబంధించిన నివేదికలు తెప్పించుకున్నారు. నగరంలోని శారదానగర్ మైనార్టీ పోస్ట్‌మెట్రిక్ బాలుర వసతిగృహం ఉంది. అయితే అందులో దాదాపు కొన్నేళ్లుగా విద్యార్థులకు మెనూ అమలుకు అధికారాలివ్వలేదు. దీంతో డైట్ బిల్లులు వచ్చిన సమయంలో ఆ విద్యార్థుల ఖాతాలకు నెలకు ఒక్కొక్కరికి రూ.1600 జమ చేసేవారు. ఆ కొద్దిపాటి మొత్తం విద్యార్థులకు నెలంతా సరిపోయేది కాదు. దీంతో ఇంటి నుంచి తల్లిదండ్రులు పంపే డబ్బుతో సర్దుబాటు చేసుకునేవారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మైనార్టీ విద్యార్థులకు ఈ బాధలు తప్పనున్నాయి.

హాస్టల్ సామర్థ్యం పెంచితే...

మైనార్టీ బాలుర కాలేజీ వసతిగృహంలో గతంలో 50 మంది విద్యార్థులకే అవకాశం కల్పించారు. దీంతో ఎంతో మంది పేద మైనార్టీ విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. అందులో మెనూ కూడా అమలు చేయకపోవడంతో హాస్టల్‌లో 20 మందికి మించి ఉండేవారు. కాదు. ఈ ఏడాది కూడా 25 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మెనూను సక్రమంగా అమలు చేస్తే మరింత మంది విద్యార్థులు పెరిగే అవకాశముందన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు సమాచారం.

సంక్రాంతి తర్వాత మెనూ అమలు



నెల కిందటే మెనూ అమలుకు కావాల్సిన వంట సామగ్రి ఇతర వస్తువులకు సంబంధించి నివేదికలు తయారు చేసి రాష్ట్ర అధికారులకు పంపాం. అక్కడి నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ నేపథ్యంలోనే పొరుగు హాస్టల్ వార్డెన్లతో మాట్లాడుతున్నాం. వారి వద్ద వంట సామగ్రి ఉంటే దానితోనే సంక్రాంతి సెలవుల అనంతరం హాస్టల్ విద్యార్థులకు మెనూను అమలుచేస్తాం. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెంచే విషయంపై అధికారులకు వివరించాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రామసుబ్బారెడ్డి, ఏడీ, మైనార్టీ సంక్షేమశాఖ

మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలి

ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్

అనంతపురం అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు తక్షణమే మినిమల్ టైం స్కేల్ అమలు చేయాలని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతు బజార్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మిలతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్‌ను (ఎంటీఎస్) వర్తింపజేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గత టీడీపీ హయాంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా తమను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగంలోకి తీసుకున్నారన్నారు. గత పదేళ్లుగా వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఇతర శాఖల్లోని ఉద్యోగుల తరహాలోనే సమాన పనికి సమాన వేతనం అందించే విధంగా మినిమమ్ టైం స్కేల్‌ను తక్షణమే వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు సుధాకర్, గంగరాజు, అపర్ణ, ఉమా, శిరీష, ధనలక్ష్మి, రెస్మా, నలినక్ష తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై ఈనెల 12వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడో తేదీకే గడువు ముగిసినా ప్రభుత్వం మరో ఐదు రోజులు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అప్పటివరకు నిర్దేశించిన ప్రాంతాలలో అధికారులు అందుబాటులో ఉంటారని, ఎవరికైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను ఈనెల 16వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం వచ్చినవాటిపై తనిఖీ చేసి ఈనెల 20న గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శిస్తారన్నారు.

విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీగా బి.వినోద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకూ ఏడీగా ఉన్న అబ్దుల్ రసూల్ గతనెల ఉద్యోగ విరమణ పొందారు. చిత్తూరులోని అదే శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బి.వినోద్‌ను ఆ శాఖ రాష్ట్ర అధికారులు ఉమ్మడి అనంత జిల్లా ఏడీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఏడీకి ఆ శాఖ అధికారులు, సిబ్బంది, పలువురు విభిన్న ప్రతిభావంతులు శుభాకాంక్షలు తెలిపారు.



ఏడీ వినోద్

వాస్కో రైళ్ల పాక్షిక రద్దు

గుంతకల్లు, జనవరి7(ఆంధ్రజ్యోతి): నైరుతి రైల్వేలోని కాస్టిల్ రాక్-కులెమ్ సెక్షన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ వర్కుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే వాస్కోడగామా రైళ్లను పాక్షికంగా రద్దు చేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. షాలిమార్-వాస్కోడగామా మధ్యన నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్ (నం. 18047) రైలును ఈ నెల 16 ఏప్రిల్ 15వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 18048)ను ఈ నెల 19 నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకూ వాస్కోడగామా-హుబ్లీ సెక్షన్‌లో పాక్షికంగా రద్దుపరచి హుబ్లీ-షాలిమార్ సెక్షన్‌లో నడపనున్నట్టు తెలియజేశారు. అలాగే తిరుపతి-హైదరాబాద్, హైదరాబాద్-వాస్కో వెళ్లే (నం. 17419, 17019) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ వాస్కో వరకూ కాకుండా కేవలం హుబ్లీ వరకు మాత్రమే నడపనున్నట్టు వివరించారు. అలాగే వీటి తిరుగు ప్రయాణపు రైళ్లను (నం. 17420, 17022) ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకూ హుబ్లీ-వాస్కో సెక్షన్‌లో పాక్షికంగా రద్దు పరిచామన్నారు. సికింద్రాబాద్-వాస్కోడగామా బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 17 నుంచి ఏప్రిల్ 16 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17040) ఈనెల 18 నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకూ హుబ్లీ-వాస్కో సెక్షన్‌లో పాక్షికంగా రద్దుచేశారు.

రైళ్ల ఆలస్యం



గుంతకల్లు, జనవరి7(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా కాచిగూడ-గుంతకల్లు (నం. 57412), గుంతకల్లు-బోధన్ (నం. 57411) రైళ్లను ఈ నెల 20, 27 తేదీల్లో ఆలస్యంగా నడపనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ-గుంతకల్లు రైలును మూడున్నర గంటలు, గుంతకల్లు-బోధన్ రైలును 3 గంటల ఆలస్యంగా నడపనున్నట్టు తెలియజేశారు.



చిరంజీవితో భవానీ రవికుమార్

చిరంజీవిని కలిసిన భవానీ రవికుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సినీ హీరో మెగాస్టార్ చిరంజీవిని, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు భవానీ రవికుమార్ కలిశారు. హైదరాబాదులోని చిరంజీవి స్వగృహంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి తనను గుర్తుపట్టి, ఆప్యాయంగా పలుకరిస్తూ ఆలింగనం చేసుకోవడంతో భావోద్వేగానికి గురైనట్లు భవానీ తెలిపారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన తనను ఆశీర్వదించడం తన జీవితంలో మరిచిపోలేనన్నారు.

చాముండేశ్వరికి రాష్ట్ర పదవి

అనంతపురం టౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఏపీ హంస స్టేట్‌జాయింట్ జనరల్ సెక్రెటరీగా స్టాఫ్‌నర్సు చాముండేశ్వరి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. చాముండేశ్వరి ప్రస్తుతం అనంత సర్వజన ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తున్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు అప్పగించడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

టమోటా కిలో రూ. 10



అనంతపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23,100 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 7,200, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 13 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇన్‌ఫ్లో 684 క్యూసెక్కులు

బెళుగుప్ప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 684 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 442 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటి నిల్వ 1.681 టీఎంసీలు వుందని అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు మంగళవారం ఘర్షణకు దిగారు. విద్యార్థులు తెలిపిన మేరకు పట్టణంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ విద్యార్థులు ఒకరికొకరు వాదులాడుకున్నారు. ఈ నేపథ్యంలో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని తమ మిత్రులకు ఈ గొడవపై సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి ఘర్షణకు దిగారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వర్ధన్ అనే విద్యార్థి గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంతలోనే పట్టణ పోలీసులు జోక్యం చేసుకుని రెండు కళాశాలల విద్యార్థులను పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు కళాశాలల ప్రిన్సిపాళ్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

పట్ట పగలే ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న సీఐ

గుత్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలో మంగళవారం పట్ట పగలే ఉపాధ్యాయుడు రాజేష్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష అపహరించినట్లు రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి తాళాలు వేసి ఆయన, ఆయన భార్య విధులకు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దాం

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మంజుల



రికార్డులను పరిశీలిస్తున్న డైరెక్టర్ మంజుల

బత్తలపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దామని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మంజుల తెలిపారు. మండల కేంద్రంలో ఆర్డీటీ నిర్వహిస్తున్న ఏఆర్‌టీ ఆస్పత్రిని ఆమె మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హెచ్ఐవీ పీడితులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. హెచ్ఐవీ పీడితులకు బీపీ, సుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రెండు జిల్లాల వైద్య శాఖ, ఏఆర్‌టీ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

తేజ ప్రసాద్ మృతి తీరని లోటు

నివాళులు అర్పించిన ప్రముఖులు

జోహార్లు అర్పిస్తూ జర్నలిస్టుల కడపటి వీడ్కోలు

అనంత వైద్యకళాశాలకు పార్థివ దేహం అప్పగింత



తేజ ప్రసాద్ అంతిమయాత్రలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు



కాలవ శ్రీనివాసులు



పూలమాల వేస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్



జగదీష్, వేమయ్య యాదవ్



సీపీఐ జాఫర్



విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విశిష్ట సేవలందించిన తేజ ప్రసాద్ మృతి తీరని లోటు అని పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ప్రెస్‌క్లబ్‌లో తేజ ప్రసాద్ భౌతిక కాయానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితర నాయకులు, జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు ఆయన పార్థివదేహాన్ని ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా తీసుకువెళ్లి మెడికల్ కళాశాలకు అందజేశారు. జర్నలిస్టులు తేజ ప్రసాద్ జోహార్లు అర్పించారు. తన మరణానంతరం వైద్య విద్యార్థులకు తన శరీరం ఉపయోగపడాలన్న తేజ ప్రసాద్ ఆలోచన ఆచరణీయమని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాల రావు అన్నారు. ఆయన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చూకూరాలని ప్రార్థించారు.

ప్రముఖుల సంతాపం

సీనియర్ జర్నలిస్టు తేజ ప్రసాద్ మృతికి సీపీఎం సంతాపం వ్యక్తం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వామపక్ష ఉద్యమానికి, సీపీఎంకు ప్రసాద్ ఎంతో అండగా నిలిచారని గుర్తు చేసుకున్నా రు. వ్యక్తిగతంగా నూ తనతో ఎంతో ఆప్యాయంగా ఉండేవారని, అనేక సలహాలు, సూచనలు ఇచ్చే ప్రసాద్‌ను కోల్పోవడం బాధగా ఉందని పేర్కొన్నారు. సీపీఎం నగర కార్యదర్శి వి. రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, నాయకులు ప్రకాష్, శేషయ్య, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి సోదరుడు సుందర్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఎరువుల డీలర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, కోశాధికారి రమేష్ తదితరులు తేజా ప్రసాద్‌కు నివాళులు అర్పించారు.

తూకాల్లో మోసం..పసిగట్టిన రైతులు

జరిమానా చెల్లించి బయటపడ్డ వ్యాపారి

విడపనకల్లు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంది రైతులను ఓ వ్యాపారి మోసగించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ వ్యాపారి రెండు రోజుల కిందట వి. కొత్తకోట గ్రామంలోని రైతుల వద్ద కందులు కొనుగోలు చేశాడు. వాటిని ఎలక్ట్రానిక్ కాటాలో తూకాలు వేశాడు. ఒక్కో బ్యాగులో 50 కిలోలు తీసుకోవాల్సి ఉండగా బాదు పేరుతో అదనంగా రెండు కిలోలు తూచాడు. ఇలా తూచిన కందుల బస్తాలను వరుస క్రమంలో పక్కన పెట్టుకుంటూ వచ్చాడు. కందుల బస్తాలును చూస్తున్న రైతులకు ఇవి 52కేజీల కంటే ఎక్కువ ఉన్నాయని అనుమానం వచ్చింది. వెంటనే వేరే తూనికను తెప్పించి సంచులను తూకం వేయించారు. దీంతో ఒక్కో బస్తా బరువు 60నుంచి 62 కిలోలు వచ్చింది. దీంతో ఆగ్రహించిన రైతులు వ్యాపారిపై దాడికి దిగారు. అనంతరం లారీని, వ్యాపారిని పోలీసులకు అప్పగించేందుకు యత్నించారు. అయితే మధ్యవర్తులు కలుగజేసుకుని రైతులతో చర్చించారు. కందులు అమ్మిన ప్రతి రైతుకు రూ.లక్ష అదనంగా(జరిమానా) ఇప్పించేలా ఒప్పందం కుదిర్చారు. ఆమేరకు వ్యాపారి డబ్బు వెంటనే చెల్లించి, కేసు లేకుండా తప్పించుకున్నాడని రైతులు తెలిపారు.

15 రోజుల కిందట చాబాలలోను ఇదే తంతూ...

గత 15 రోజుల కిందట వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలో కందులను కొనుగోలు చేసిన వ్యాపారి ఎలక్ట్రానిక్ కాటాతో(తూనిక)తో ఒక్కొక్క బస్తాకు 8 నుంచి 10 కేజీలు అదనంగా తూకాలు వేసి లారీకి లోడ్ చేశాడు. అనుమానం వచ్చిన రైతులు తూకాలు చేసిన ఆ బస్తాలను కిందకు దించి వేరే ఎలక్ట్రానిక్ కాటాలో వేసి చూడగా మోసం బయటపడింది. దీనిపై గ్రామస్థులు వజ్రకరూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూనికలు కొలతలు అధికారులు చాబాల గ్రామం చేరుకుని ఎలక్ట్రానిక్ తూనిక కింది భాగంలో ఓపెన్ చేసి చూడగా 10 కేజీలు ఎక్కువ తీసుకునేలా సెట్ చేసి పెట్టినట్లు నిర్ధారించారు. దీంతో వ్యాపారులపై కేసు నమోదు చేశారు. వ్యాపారుల మోసాలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రథయాత్రను జయప్రదం చేయండి

ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని బంజార భవన్ నుంచి నాయక్ నగర్ వరకు ఈనెల 26న నిర్వహించనున్న శాంతి సద్భావన యాత్రను జయప్రదం చేయాలని అఖిల భారత బంజారా సేవా సంఘ్(ఏబీఎస్ఎస్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలాజి నాయక్, బాబునాయక్ పిలుపునిచ్చారు. ఏబీఎస్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం శాంతి సద్భావన యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రతిఏటా ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఉత్సవాల సూచికగా జనవరి 26న జిల్లా కేంద్రంలో శాంతి సద్భావన యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 26న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలోని రెండో రోడ్డులోని బంజారా భవన్ నుంచి శాంతి సద్భావన యాత్ర మొదలై క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్, విద్యుత్‌నగర్ సర్కిల్ మీదుగా నాయక్‌నగర్‌లోని మారెమ్మ దేవాలయ సందర్శనా నంతరం నాయక్‌నగర్‌కు చేరుకోవడంతో ముగుస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని బంజారాలంతా పెద్దసంఖ్యలో పాల్గొని శాంతి సద్భావన యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగ్లానాయక్, డాక్టర్ రమణ నాయక్, సేవామాల గురురాజేంద్ర ప్రసాద్, మహిళావిభాగం జిల్లా కార్యదర్శి శివమణిబాయి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, విజయలక్ష్మిబాయి తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగు చేయండి

రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

మద్దతు ధరతో కొనుగోలుకు నిర్ణయం

క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు



రాగిపంట (ఫైల్)

ధర్మవరం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి):రాగి మంచి పోషకాలు కలిగిన సంప్రదాయ పంట. గతంలో రాగి పంటకు భలే డిమాండ్ ఉండేది. రాగి ముద్ద లేనిదే ముద్ద నోట్లోకి దిగేది కాదని ఆయా గ్రామస్థులు చెబుతారు.రాగుల కోసం రైతులు రబీలో ముందస్తుగా పంటను సాగుచేసుకునేవారు. రాగి పంట ప్రతికూల, బెట్ట పరిస్థితులను తట్టుకుని దిగుబడి ఇస్తుంది. మెట్టసాగుకు అనుకూలంగా ఉంటుంది. రాగి గింజలకు నిల్వపురుగులను తట్టుకునే అధిక శక్తి ఉంటుంది. రానురాను పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగు తగ్గుముఖం పట్టింది. కొన్నేళ్లుగా రాగులకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రభుత్వమే పంట సాగును పెంచేందుకు చర్యలు చేపట్టింది. మద్దతు ధర ప్రకటించి, పంట దిగుబడిని ప్రభుత్వమే కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. గ్రామాల్లో రాగిపంట సాగు పెంచేందుకు వ్యవసాయాధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.


క్వింటానికి రూ.4,290..

రాగి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. రాగి సాగును పెంచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయాధికారుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం మద్దతు ధర క్వింటాకి రూ.4290గా నిర్ణయించింది. ఈ నెలలో పంట సాగుచేసుకుంటే వేసవిలో దిగుబడి వస్తుందని అధికారులు తెలుపుతున్నారు.

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి..

రాగి పంటకు తక్కువ పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు సాధించవచ్చు. పెద్దగా మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. పశువుల పేడ, కాంప్లెక్స్ ఎరువులు వేయాలి. మిగతా పంటలతో పోల్చుకుంటే రాగికి చాలా తక్కువ పెట్టుబడులు అవసరం.

ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంది



రాగి సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంది. క్వింటా రూ.4290తో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ప్రస్తుతం రాగి సాగుచేసే రైతులు తప్పనిసరిగా క్రాప్‌బుకింగ్ చేయించుకోవాలి. తద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సులువవుతుంది. రాగి సాగు చేసేలా ఇప్పటికే రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతులు బోరుబావుల కింద పంట పెట్టుకోవాలి.

- కృష్ణయ్య, ఏడీఏ, ధర్మవరం

మట్కాకష్ అయ్యేనా..?

పోలీసులది ఆరంభశూరత్వమేనా..?

రెండు రోజుల్లో రూ.లక్ష పట్టివేత

మట్కాపై దాడులు కొనసాగేనా



తాడిపత్రి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పోలీసులు మట్కాపై ఉక్కుపాదం మోపుతారా లేక ఏదో పేపర్లలో వచ్చింది కదా అని కొన్ని రోజులు హడావుడి చేసి వదిలేస్తారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రెండురోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో విస్తరిస్తున్న మట్కా శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో వరుసగా రెండురోజులపాటు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి 9:45గంటల సమయంలో పట్టణంలోని గాంధీకట్ట వద్ద దాడులు నిర్వహించి రూ.70వేలు సీజ్‌చేశారు. మంగళవారం నంద్యాలరోడ్డులో మట్కాబీటర్‌ను అరెస్ట్‌చేసి రూ.30వేలు సీజ్‌చేశారు. రెండురోజుల వ్యవధిలోనే లక్ష రూపాయలు సీజ్‌చేశారు. దీంతో మట్కాను ఇన్నిరోజులు పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దాడులు గతంలోనే చేసి ఉండి ఉంటే మట్కా ఈ స్థాయిలో విస్తరించేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇతర జిల్లాల నుంచి వచ్చి..

నెల్లూరు, చిత్తూరు, ప్రొద్దుటూరు, నంద్యాల ప్రాంతాల నుంచి సైతం మట్కాబీటర్లు తాడిపత్రికి వచ్చి మట్కా రాస్తున్నారంటే ఇక్కడ ఏ స్థాయిలో మట్కా జరుగుతోందో అర్థమవుతుంది. నంద్యాలరోడ్డులో మంగళవారం జరిపిన దాడుల్లో పట్టుబడిన మట్కాబీటర్ జయరామిరెడ్డి స్వస్థలం నెల్లూరు జిల్లా అని తెలుస్తోంది. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వీరు వారంలో నాలుగురోజులపాటు తాడిపత్రిలో మకాం వేసి మట్కాను పకడ్బందీగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు పట్టణంలోని మురికివాడల్లో నివసిస్తున్న పేదలను టార్గెట్ చేస్తూ కేంద్రాలను నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఇలా పట్టణంలో మట్కాను పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్న బీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతారో లేదో వేచిచూడాల్సిందే.

కదిరి సంతలో నకిలీ నోట్లు

రైతును మోసగించిన యువకులు



నకిలీ నోట్లను చూపిస్తున్న బాధిత రైతు నగేష్

కదిరి అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డు గొర్రెల సంతలో నకిలీ నోట్లు కలకలం రేపాయి. ముదిగుబ్బకు చెందిన రైతు నగేష్ మంగళవారం రెండు పొట్టేళ్లను సంతకు తెచ్చి విక్రయించారు. ఇద్దరు యువకులు పొట్టేళ్లను బేరమాడి, రూ.32 వేలకు కొనుగోలు చేశారు. ఆ మొత్తానికి రూ.500 నోట్లు ఇచ్చి.. పొట్టేళ్లను తీసుకెళ్లారు. కాసేపటి తరువాత అనుమానం వచ్చిన రైతు.. పక్క రైతులకు చూపించగా, అవి నకిలీ నోట్లు అని తేలింది. దీంతో రైతు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయాన్ని వెంటనే మార్కెట్ యార్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నీరంజన్‌రెడ్డి సిబ్బందితో మార్కెట్ యార్డుకు వెళ్లి విచారించారు. రైతు నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు. ప్రజలు నకిలీ నోట్లపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎగతాళి చేశారని

విద్యార్థి ఆత్మహత్యాయత్నం



విద్యార్థిని విచారిస్తున్న ఎస్ఐ రాంప్రసాద్

అనంతపురంరూరల్/క్రైం, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఎగతాళి చేశారన్న బాధతో ఓ విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. విద్యార్థి తల్లి , కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు సోమనాథ్‌నగర్‌కు చెందిన విద్యార్థి తపోవనంలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్నాడు. అదే క్లాస్‌లో తనతో పాటు చదువుకుంటున్న తన సమీప బంధువుల కుర్రాడితో సోమవారం గొడవపడ్డాడు. ఈ విషయం ఉపాధ్యాయుల దృష్టికి వెళ్లగా మ్యాథ్స్ టీచర్ సురేష్ బాధితుడినే మందలించి రెండు దెబ్బలు వేశాడు. మరుసటి రోజు మంగళవారం స్టడీ అవర్స్‌లో ఇంగ్లిష్ టీచర్ సరళ కూడా బాధిత బాలుడిని హేళనగా మాట్లాడారట. తర్వాత ఇదే విషయంలో తోటి విద్యార్థులు హేళన చేస్తూ మాట్లాడారట. ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోకపోవడం, ఫిర్యాదు చేసిన తననే మందలించడంతో ఆ బాలుడు తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే మధ్యాహ్న సమయంలో పాఠశాలలోని బాత్రూంలోకి వెళ్లి ఫినాయిల్ తాగాడు. గమనించిన ఉపాధ్యాయులు బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పడంతో విద్యార్థి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న నాలుగో పట్టణ ఎస్ఐ రాంప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థిని విచారించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యం.. కేసుల నమోదు

గుంతకల్లుటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోదీనాబాద్ కాలనీలో నివాసముంటున్న ఉరుకుందమ్మ, దిలీప్ దంపతుల కుమారుడు బెలగల రాహుల్, అతడి స్నేహితుడు పరుశురాముడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ మంగళవారం తెలిపారు. రాహుల్ 8వ తరగతి చవుతున్నాడు. స్కూల్‌కు సరిగా వెళ్లడం లేదని అతడి తల్లి మందలించిందన్నారు. దీంతో ఉదయం రాహుల్ స్కూల్‌కు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి అదే కాలనీకి చెందిన అతడి స్నేహితుడు పరుశురాముడుతో కలిసి వెళ్లాడన్నారు. సాయంత్రమైనా వారు ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఇద్దరు అబ్బాయిలు ఆచూకీ తెలిస్తే సెల్: 9440796821 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

- మోమినాబాద్‌కు చెందిన ఖాజాభాను అనే మహిళా అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పదేళ్ల కుమార్తెను తీసుకుని ఇంటినుంచి సోమవారం వెళ్లిపోయిందని భర్త షేక్ ఇబ్రహీం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం,జనవరి7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు భార్య పుష్పావతి(32) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రామాంజనేయులు పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే క్రమంలో అతను మద్యానికి బానిసయ్యాడు. తాగుడు అలవాటు మానుకోవాలని భార్య, కుటుంబసభ్యులు తరచూ చెప్పేవారు. ఈ విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవ కూడా జరిగేది. ఈక్రమంలోనే మంగళవారం మరోసారి భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన పుష్పావతి మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత...

నగరంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియాన్ని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రాణినగర్‌కు చెందిన షేక్ దూద్‌పీర్ ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా గుత్తిరోడ్డులో పోలీసుల తనిఖీలో ఆటో పట్టుబడింది. దూద్‌పీర్‌ను అరెస్ట్ చేసి ఆటోలో ఉన్న 19 బస్తాల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు.



బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 224879

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926.

AJA-224944

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పట్టు తప్పింది!

- తగ్గిన మల్బరీ సాగు
- కనుమరుగవుతున్న రేషం తోటలు
- ఆరేళ్లుగా అందని ప్రోత్సాహకం
- మల్బరీ సాగుకు మొగ్గు చూపని రైతులు

నల్లమాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ప్రధాన వాణిజ్య పంటగా మల్బరీ సాగు ఓ వెలుగు వెలిగింది. ప్రధాన జీవనాధారమైన వేరుశనగ పంటకు, ప్రత్యామ్నాయంగా రైతులు పట్టు పెంపకంపై ఆసక్తి చూపేవారు. రైతులు ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడంతో మల్బరీ సాగు ప్రముఖంగా ఉండేది. మండలంలో రైతులు పట్టు పురుగుల పెంపకంపై గతంలో ఎక్కువ మక్కువ చూపేవారు. గతంలో మండలంలో 1800 ఎకరాల్లో మల్బరి పంట సాగుచేసేవారు. నాటి ప్రభుత్వం కిలో రేషం గూళ్లకు రూ. 50 ప్రోత్సాహక ధనం ఇచ్చేది. అలాగే మల్బరీ పెంపకానికి అధికారులు సహకారం అందించేవారు. దీంతో రైతులు ఉత్సాహంగా మల్బరీ సాగుచేసేవారు. నెలకు నాలుగు పంటలు తీసి.. అధిక దిగుబడులు పొంది, ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేవారు. మండలంలో అత్యధికంగా కుటాలపల్లిలో 90 శాతం మంది రైతులు పట్టు పెంపకంపై మొగ్గు చూపేవారు. దాదాపు ప్రతి నెలా ఈ గ్రామానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చేది. ఈ గ్రామంలో మల్బరీ సాగు చేయనివారు లేరు. మల్బరీ సాగు రైతులందరూ కర్ణాటక నుంచి రేషం గుడ్లు తీసుకువచ్చేవారు. అనంతరం పట్టుగూళ్లను వారు కర్ణాటకలోనే అమ్మేవారు. సీబీ రకం వంద రేషం గుడ్లకు రూ.8వేలు, బైబోల్టు రకం వంద గుడ్లకు రూ. ఆరువేల చొప్పన కర్ణాటక నుంచి తెచ్చుకుని మల్బరీ పంట సాగు చేసేవారు. మంచి దిగుబడులు వస్తే కిలో గూళ్లు రూ. 600 ధరలు పలికేవి. ఇలా నెలలో నాలుగు రేషం పంటలు తీసేవారు.

అలాంటి మల్బరీ సాగు మండలంలో ఏటా తగ్గుముఖం పడుతోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గిపోయాయి. సాగునీటికి కొరత ఏర్పడింది. ఐదేళ్ల నుంచి మల్బరీ పెంపకం పూర్తిగా తగ్గిపోయింది. అంతేకాకుండా వైసీపీ పాలన ఐదేళ్లలో మల్బరీ సాగుచేసిన పట్టుగూళ్లకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రోత్సహక ధనం ఇవ్వలేదు. ఆ డబ్బులు వస్తే రైతులకు కనీసం కూలీ ఖర్చులకైనా వచ్చేవి. దీంతో ప్రస్తుతం కొందిమంది రైతులు తప్ప ఎవరూ మల్బరీ సాగు చేయడం లేదు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 100 మించి మల్బరీ పంటను సాగు చేయడం లేదు. మండలంలోని పులగంపల్లి, ఎర్రచెరువుపల్లి, దొన్నికోట, చెరువు వాండ్లపల్లి, వేళ్లమద్ది, వంకరకుంట గ్రామాల్లో అరకొరగా మల్బరీ సాగుచేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా మల్బరీ సాగుకు పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పులగంపల్లి వద్ద ఖాళీగా ఉన్న పట్టుగూళ్ల షెడ్

రైతులను ప్రోత్సహించాలి



గత రెండు సంవత్సరాల క్రితం నాకున్న పొలంలో రెండు ఎకరాల్లో మల్బరీ సాగుచేశా. 250 గుడ్లు మేపుతున్నా. గతంలో ప్రోత్సాహక ధనాన్ని ప్రభుత్వం ఇచ్చేది. ఆరు సంవత్సరాలుగా అది ఇవ్వడం లేదు. అధికారులు కూడా మల్బరి సాగుకు పలు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం పాలనలో రైతులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. దీంతో ప్రస్తుతం మల్బరీ సాగుపట్ల ఎవరూ ఆసక్తి చూపడం లేదు. మల్బరీకి పూర్వవైభవం వచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- భానుప్రతాప్‌రెడ్డి, పులగంపల్లి

ప్రోత్సాహక ధనమివ్వాలి



నేను రెండు ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తున్నా. గతంలో పండించిన పట్టు గూళ్ల కిలోకు ప్రభుత్వం రూ. 50 చొప్పన ఇన్‌సెట్యూవ్ ఇచ్చేది. ఆరు సంవత్సరాల నుంచి ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం మళ్లీ ఇన్‌సెట్యూవ్ ఇస్తే.. రైతులు మళ్లీ.. మల్బరీ సాగు వైపు మొగ్గు చూపుతారు.

- ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్, పులగంపల్లి

న్యూస్ బాక్స్

సంక్రాంతి ఆటల పోటీలు

ధర్మవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నియోజకవర్గంలో యువతీయువకులకు ఈనెల 13, 14 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గంలోని యువత ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరింది.

రేపు ముగ్గుల పోటీలు...

సంక్రాంతి పండుగ నేపథ్యంలో స్థానిక సాయినగర్‌లోని షిర్డీసాయి బాబా ఆలయ ఆవరణంలో ముత్యాల ముగ్గుల పోటీలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని, ఆసక్తి గల మహిళలు తమ పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని, వివరాలకు 8297621055, 08559-352668 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పంట నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పంట నమోదు చేస్తున్న ఏఓ

నంబులపూలకుంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పంటలను పర్యవేక్షిస్తూ రైతులకు తగు సూచనలు, సలహాలు అందించాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిది. యాప్ ద్వారా పంట నమోదు చేయడం.. పంటలకు ఆశించిన చీడపీడలను వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి.. నివారణ చర్యలను రైతులకు సూచించాల్సి ఉంది. అయితే రైతు సేవా కేంద్రాల్లో పనిచేయాల్సిన సిబ్బంది.. సచివాలయాల్లో ఉండటంతో రైతులకు సేవలు అందడం లేదు. దీనిపై దిష్టిబొమ్మలా ఆర్బీకేలు అనే వార్తను ఆంధ్రజ్యోతి మంగళవారం ప్రచురించింది. స్పందించిన వ్యవసాయాధికారి లోకేశ్వర్‌రెడ్డి రైతు సేవా కేంద్రం సిబ్బందితో పొలాలోకెళ్లి పంటలు నమోదు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రైతు సేవా కేంద్రం సిబ్బంది పంటలు నమోదు చేస్తారని, మధ్యాహ్నం 3 నుంచి పంట నమోదు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని చెప్పారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పల్లె శుభాకాంక్షలు



పుట్టపర్తి రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి శుభా కాంక్షలు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చాంబర్‌లో ఆయన్ను మాజీ మంత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

10న ముక్కోటి ఏకాదశి వేడుకలు

ధర్మవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర ద్వారం ద్వారా దర్శనభాగ్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి, గోదాదేవి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరవుతారన్నారు.

వేలం ద్వారా భారీ ఆదాయం

బత్తలపల్లి, జనవరి 7(ఆంధజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని మూడు అద్దె గదులకు వేలంపాట నిర్వహించగా.. భారీగా ఆదాయం వచ్చింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ నరసింహనాయుడు ఈ వేలం పాట నిర్వహించారు. మొదటి గది వేలం పాటను నెలకు రూ. ఏడు వేలతో ప్రారంభించగా.. రూ. 11 వేలకు, రెండు, మూడు గదులను రూ.7,500తో ప్రారంభించగా.. రూ.26,500, రూ.23 వేలకు పోటీదారులు దక్కించుకున్నారు. ఇప్పటి వరకు ఎప్పుడు ఇంత ధర పలకలేదని, తద్వారా జిల్లా పరిషత్‌కు భారీ ఆదాయం చేకూరనుంది.

వినూత్న ఆలోచనలతోనే భవిష్యత్తు

పుట్టపర్తిరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని హ్యూమానిటీస్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సాంబశివయ్య అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ నిర్వహించిన మల్టీ డిసిప్లెనరీ రీసెర్చు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన పరిశోధన పండితులు, అధ్యాపకులు, విద్యార్థులు తమ పరిశోధనా రచనలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎనర్జీ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ అనిరుధ్ సికార్, పీడీఈఏ కెమిస్ట్రీ ఫ్యాకల్టీ గుజరాత్ డాక్టర్ రోష్నీకుమారి, కళాశాల ప్రిన్సిపల్ సెంథిల్‌కుమార్, డీన్ బాల కోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

ధర్మవరంరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను డీఈఓ కిష్టప్ప మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా... మధ్యాహ్న భోజనం రుచిగా ఉందా.. అని ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉండటంతో వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చేయాలని హెచ్‌ఎం లింగారెడ్డికి సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బీఎస్ఆర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం నిర్వహిస్తున్న అదనపు తరగతులను పరిశీలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప

భూసమస్యలను పరిష్కరించండి

నంబులపూలకుంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఇప్పటివరకు 250 ఫిర్యాదులు అందాయని, ఎక్కువగా సాగు భూముల పట్టాల సమస్యలే ఉన్నాయని తహసీల్దార్ దేవేంద్రనాయక్ అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వాటిని పరిష్కరించడానికి చొరవ చూపాలని ఆయన సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాము అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ ఆంజనప్ప అజెండాను చదివి వినిపించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈనెలలో పైలెట్ ప్రాజెక్టుగా ఎదురుదొనలో రీసర్వే నిర్వహిస్తామని, ముందుగా ప్రభుత్వం భూములను సర్వే చేస్తామని అన్నారు. పశువైద్యాధికారి బాలనాయక్ మాట్లాడుతూ.. తమ సిబ్బంది సచివాలయ పనులకు, సర్వేలకు వెళ్లడంతో తమ పనులు జరగడంలేదని వాపోయారు. ఏపీఎం వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.పది లక్షల వరకు వడ్డీలేని సంఘాలకు రుణాలు మంజూరు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ, తహసీల్దారు

రోగులతో మర్యాదగా మాట్లాడండి



సిబ్బందిపై హరీశ్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న రోగులు

ధర్మవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోగులతో అప్యాయంగా, మర్యాద మాట్లాడాలని, దురుసుగా ప్రవర్తించరాదని స్థానిక ప్రభుత్వాస్పత్రి సిబ్బందికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు సూచించారు. హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వ్యాపిస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డును మంగళవారం ఆయన పరిశీలించారు. ఆ సమయంలో కొందరు రోగులు ఆయనతో మాట్లాడారు. ఆస్పత్రిలో మందులు పంపిణీ చేసే సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవరిస్తున్నారని, చీదరించుకుంటున్నారని వాపోయారు. దీంతో ఆయన వెంటనే ఆ సిబ్బందికి వద్దకు వెళ్లి.. రోగులతో అప్యాయంగా మాట్లాడాలని... దురుసుగా ప్రవర్తించరాదని మందలించారు. ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, సాకే ఓబులేశు, గుండాపుల్లయ్య, బిల్లేశిన ఉన్నారు.

ఘనంగా వేమన సంతర్పణ

గాండ్లపెంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి శ్రీయోగి వేమన ఆలయంలో సంత్పరణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. గొడుగుల మేరవన, కత్తిసాము, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ పొర్లుదండాలు పెట్టారు.



వేమన ఆలయం చుట్టూ గొడుగులు ఊరేగిస్తున్న భక్తులు

ఉపాధి పనులు కల్పించండి

నంబులపూలకుంట: జాబ్‌కార్డులున్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని, అలా చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆంజనప్ప, ఎంపీపీ రాము హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో పార్టీలకు అతీతంగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, ఏపీఓ చంద్రశేఖర్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం నాట్యకళాకారులకు అవార్డులు

ధర్మవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచలం ఆలయంలో సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంస్థ సోమవారం నిర్వహించిన నేషనల్ లెవెల్ క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో ధర్మవరం లలిత నాట్యకళానికేతన్ శిష్యులు 40 మంది ఆది యోగి అవార్డులు అందుకున్నారన్నారు. అలాగే ఆ నాట్యకళానికేతన్ గురువులు బాబుబాలాజీ, కమల బాలాజీలకు నాట్యతపస్వి అవార్డు, హర్షశ్రీ, రామలాలిత్యలను నాట్య చూడామణి అవార్డులు అందుకున్నారు. వీరికి సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు ఆనంద్, ఆలయ ఈఓ సురభిరయల్ సర్టిఫికెట్లు, మెమొంటోలను అందించి సన్మానించారు.

అవార్డులతో ధర్మవరం నాట్య కళాకారులు



ఘనంగా పెద్దమ్మ దేవర

ముదిగుబ్బ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో గుంజేపల్లిలో మంగళ వారం పెద్దమ్మ తల్లికి దేవర కార్యక్రమాన్ని గ్రామపెద్దలు ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి.. మండలం రోజులు ప్రతిష్ఠించిన సందర్భంగా పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జ్యోతులు, బోనాలు అమ్మకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొని.. పూజలు చేయించారు.

● పరిటాల శ్రీరామ్‌కు సన్మానం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను ఉమ్మడి అనంత జిల్లా యాదవ సం ఘం వర్కింగ్ ప్రసిడెంట్ బాలరామ కృష్ణ యాదవ్, ముదిగుబ్బ మండల యాదవ సంఘం సీనియర్ నాయకులు చినగాని నరసింహ యాదవ్ ఘనంగా సన్మానించారు. మంగళవారం ధర్మవరం టీడీపీ కార్యాలయంలో శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి అనంత జిల్లాలో నెలకొన్న యాదవ సంఘం సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు.

పెద్దమ్మతల్లికి పూజలు చేయిస్తున్న పరిటాల శ్రీరామ్ →



క్రైం న్యూస్ ..

తాగొద్దన్నందుకు ఆత్మహత్య



వెంకటేష్(ఫైల్)

తనకల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచువారిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (33) మంగళవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్ గొర్రెలు మేపుతూ, చేపల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం కూడా దెబ్బతింది. ఆరోగ్యం సరిగా లేకపోయినా మద్యం సేవిస్తుండటంతో కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి అతన్ని మందలించారు. దీంతో క్షణికావేశానికి లోనైన వెంకటేష్.. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. అనంతరం గుర్తించిన.. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేష్ తండ్రి క్రిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించామని హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు చెప్పారు. వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమారైలు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఓబుళదేవరచెరువు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరప్పగారిపల్లి గ్రామంలో కర్నాటక మద్యం అమ్ముతున్న దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు. వారి నుంచి 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 2021లోనూ ఈ దంపతులపై అమడగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసు నమోదైనట్లు చెప్పారు.

తరలిపోతున్న చౌకబియ్యం



ఆటోలో తరలిస్తున్న స్టోర్ బియ్యం

గాండ్లపెంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తున్న చౌక ధన్యాపు బియ్యాన్ని అలా తీసుకువచ్చి.. ఇలా అమ్మేస్తున్నారు. దీంతో చౌకబియ్యం అక్రమార్కులకు వ్యాపారం మూడు పూవ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. లబ్ధిదారులను నుంచి కేజీ బియ్యాన్ని రూ.20 వంతున కొనుగోలు చేసి.. ఆ బియ్యాన్ని కదిరి పట్టణానికి.. అక్కడి నుంచి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ చౌక బియ్యాన్ని తరలించడకుండా అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్లు అందుతుండటంతో వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమార్కులు యథేశ్చగా బైక్‌లు, ఆటోలల్లో ఆ బియ్యాన్ని తరలిస్తున్నా... పట్టించుకునేవాడే కరువయ్యాడు.

రేషన్ షాపుల్లో తనిఖీ



కుటాగుళ్లలో రేషన్ షాప్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కదిరి: మున్సిపాలిటీ పరిధిలోని 1,822 రేషన్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు సీఎస్‌డీటీ సురేంద్ర మంగళవారం తెలిపారు. ఈ తనిఖీల్లో విజి లెన్స్ ఐటీపీ జమాల్‌బాషా, డీసీటీఓ సురేష్‌బాబు తమ సిబ్బందితో వెళ్లి.. తనిఖీలు చేపట్టారన్నారు. పలు షాపుల్లో అవకతవకలున్నట్లు గుర్తించారని, దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

నల్లమాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్మికులకు 20 మందికి టీడీపీ సామటి కోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణనాయుడు, అగ్గిరాముడు, క్రిష్టయ్య, డ్రైవర్ నరసింహులు, అంజనమ్మ, కేశవరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పొలాలకు వెళ్లే రోడ్డును మూసివేయకండి

గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చుకోవాలని సూచన



గ్రీన్‌ఫీల్డ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఏ

చిలమత్తూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పేరుతో పొలాలకు వెళ్లే రోడ్డుని పూర్తిగా మూసివేసి ఆటంకం కలిగిస్తున్నారని, ఉన్న రోడ్డుని యథాతథంగా ఉంచాలని తిమ్మాడపల్లి గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన ప్రజలు మంగళవారం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఉన్న రోడ్డుని పరిగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వాళ్లు రోడ్డు పనులు చేపడుతున్నారని గ్రామస్థులు వాపోయారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు తిమ్మాడపల్లికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. రోడ్డు లేకుండా చేయడంతో భవిష్యత్తులో తాము పొలాల్లోకి వెళ్లే పరిస్థితి లేదని, దీనిని గుర్తించి గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చుకోవాలని కోరారు. దీంతో ఆయన గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఉన్న విధంగా రోడ్డు వదిలి హైవే నిర్మాణ పనులు చేసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారెడ్డి, అంజినప్ప, సోమశేఖర్, బాలాజీ తదితరులు ఉన్నారు.

రైతు సేవాకేంద్రాల్లో రాగి పంట కొనుగోళ్లు

చిలమత్తూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాల్లో రాగి పంట కొనుగోళ్లకు ఏర్పాటుచేసినట్లు మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాగి ధాన్యానికి ప్రభుత్వం రూ.4290 మద్దతు ధర ప్రకటించిందని, రాగులు పండించిన రైతులు వాటిని అమ్ముకోవాలంటే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

కిశోరి వికాసంతో బాలికలకు బంగారు భవిష్యత్తు

పరిగి, జనవరి7(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బాలికలు వేసే ప్రతి అడుగు ఆరోగ్యకరమైన సాధికారత దిశగా ఉండాలన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ రంగడు యాదవ్ హాజరై కిశోర్ వికాసం పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతి బాలిక తమ సామర్థ్యాన్ని తెలుసుకునే విధంగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రామ్మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ

పెనుకొండ రూరల్, జనవరి7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను రొద్దం వెంకటేశ్వర ఎలక్ట్రిక్ షాపు నిర్వాహకుడు వెంకటేశ్ సహకారంతో అందజేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులు మోడల్ పేపర్‌ను ఉపయోగించుకొని ఉత్తీర్ణత చెందాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మారుతి, తేజ, రమేష్ పాల్గొన్నారు.

చౌడేశ్వరీ ఆలయానికి రూ.లక్ష వితరణ



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దంపతులు

గోరంట్ల, జనవరి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామలింగచౌడేశ్వరీ ఆలయ నిర్మాణానికి జొన్నా ఆంజనేయులు, ఆదిలక్ష్మీ దంపతులు రూ.1,00,116 మంగళవారం విరాళంగా అందచేశారు. దేవాంగుల కులదేవత, శ్రీరామలింగచౌడేశ్వరీ దేవికోసం నూతనంగా ఆలయ నిర్మాణాన్ని దేవాంగులు తలపెట్టారు. ఆ సంఘం నాయకులు, కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు స్థానిక సిల్క్ షాపు యజమాని జొన్నా ఆంజనేయులు విరాళాన్ని నగదు రూపంలో అందించారు. ఆయనను దేవాంగులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

10న మండల సర్వసభ్య సమావేశం

మడకశిర టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మడకశిర మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10వతేదీన మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని సూచించారు.

మధ్యంతర భృతి చెల్లించాలి

పెనుకొండ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీఎస్‌టీపీ యూనియన్ నాయకులు ఎంఈఓ జయభాస్కర్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం రొద్దం జెడ్పీహెచ్‌లో క్యాలెండర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూనియన్ ముందుండాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర, ఆదినారాయణ పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓకు సత్కారం



నూతన ఎంపీడీఓను సత్కరిస్తున్న సిబ్బంది

సోమందేపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి):సోమందేపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నరేంద్ర కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గోరంట్ల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన సోమందేపల్లిలో అదనపు బాధ్యతలు చేపట్టారు. కార్యాలయానికి వచ్చిన ఆయనకు ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పూలమాలలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాల అములులో తన వంతు బాధ్యతలను నిర్వహిస్తామన్నారు.

ఖాళీ కార్యాలయం..!

- సమగ్ర శిక్షకు రెండేళ్లుగా లేని రెగ్యులర్ ఏపీసీ
- సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులూ ఖాళీ
- నోటిఫికేషన్ ఇచ్చి.. ఇంటర్వ్యూలు చేసి వదిలేశారు
- విద్యాశాఖ కమిషనర్ వద్ద ఫైలు..?



అనంతపురం విద్య, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ పోస్టులు, ఫారిన్ సర్వీసు పోస్టులు అన్నీ ఖాళీనే. రెండేళ్లుగా రెగ్యులర్ ఏపీసీ లేరు. 2023 ఫిబ్రవరి నుంచి ఏపీసీ పోస్టులోకి ఇన్‌చార్జులు వస్తున్నారు. వచ్చిన వారంతా మూడు నెలలు.. ఆరు నెలలు.. ఎనిమిది నెలలు ఉండి వెళుతున్నారు. ఫారిన్ సర్వీసు కింద భర్తీ చేసే సెక్టోరియల్ పోస్టులు సైతం ఖాళీనే కనిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం అధికారులు లేకుండా ఖాళీగా కనిపిస్తోంది. ఎన్నికల ముందు వైసీపీ బ్రాండ్ ఉన్న టీచర్లు అనధికారికంగా పాగా వేశారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చాక టీడీపీ బ్రాండ్ టీచర్లు ప్రాజెక్టులోకి వద్దాం అనుకున్నారు. అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంటర్వ్యూలు చేశారు. కానీ ఇప్పటి వరకూ ఫలితాలు విడుదల చేయలేదు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియియల్ పోస్టులను భర్తీ చేయలేదు. కలెక్టర్‌గాని, డీఈఓగాని ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ ఫైల్ జిల్లాను దాటి విద్యాశాఖ కమిషనర్ చెంతకు చేరిందని చెబుతూ.. డీఈఓ కార్యాలయ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

రెగ్యులర్ ఏపీసీ వచ్చేనా..?

ప్రాజెక్టులో రెగ్యులర్ ఏపీసీ పోస్టు ఖాళీ పడి సుమారు రెండేళ్లు కావస్తోంది. 2023 ఫిబ్రవరి వరకూ ఏపీసీగా తిలక్ పనిచేశారు. ఆయన వెళ్లిన తర్వాత రెగ్యులర్ ఏపీసీని నియమించలేదు. ఇతర శాఖల నుంచి వచ్చిన వారు నిలకడగా ఉండటం లేదు. డీఈఓలు, అసిస్టెంట్ డైరెక్టర్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు కొన్ని నెలలు మాత్రమే పనిచేసి బదిలీ అవుతున్నారు. 2023 ఫిబ్రవరి తర్వాత సుమారు అర డజను మంది అధికారులు ఇన్‌చార్జి ఏపీసీలుగా పనిచేసి వెళ్లారు. ఇలా వచ్చి వెళ్లే వారితో వేగలేకున్నామని సిబ్బంది వాపోతున్నారు. రెగ్యులర్ ఏపీసీ ఉంటే తమ సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. కానీ రెగ్యులర్ ఏపీసీ ఎప్పుడొస్తారా తెలియని పరిస్థితి. గత ఏడాది డిసెంబరు 21న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 14 మందిని ఏపీసీలుగా నియమించారు. కానీ అనంతపురం జిల్లా పోస్టును మాత్రం ఖాళీగానే ఉంచారు.

నోటిఫికేషన్ ఎవరి కోసం..?

అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులు 8 ఖాళీగా ఉన్నాయి. జూలై 1న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. అక్టోబరు 1న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. కానీ ఇంత వరకూ ఫలితాలు విడుదల చేయలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఆ బ్రాండ్ టీచర్లు నోటిఫికేషన్ లేకుండా వచ్చి పనిచేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వచ్చాయి. జూన్‌లో కూటమి ప్రభుత్వం రాగానే పాత వారిని వెనక్కు పంపారు. దీంతో తమకు అవకాశం వస్తుందని కొందరు టీడీపీ బ్రాండ్ ఉన్న టీచర్లు సంబరపడ్డారు. ప్రాజెక్టులోకి రావాలని ఆశపడ్డారు. కానీ కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో వారి ఆశలు గల్లంతయ్యాయి. అయినా, పద్ధతి ప్రకారం నియామకాలు జరుగుతాయని భావించి, చాలా మంది నోటిఫికేషన్‌ను స్వాగతించారు. ఆశావహులు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలకు వెళ్లారు. కానీ ఫలితాలు విడదల చేయకపోవడంతో ఉసూరుమంటున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా కలెక్టర్, డీఈఓ వద్ద లేదని చెబుతున్నారు. ఫైల్ విద్యాశాఖ కమిషనర్ వద్ద ఉందని, తాము ఏమీ చేయలేమని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. సమస్య పరిష్కారం కావాలంటే విద్యాశాఖ కమిషనర్ దృష్టి సారించాల్సిందేనని అంటున్నారు.

పనుల కల్పనలో ఎఫ్ఏల పాత్ర కీలకం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనులు కల్పడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ పేర్కొన్నారు. రాజధాని అమరావతి నుంచి మంగళవారం నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన ఏపీడీల సమావేశంలో డ్వామా పీడీ సలీంబాషా మాట్లాడుతూ.. ఉపాధి పథకం అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

ప్రధానికి ఆంధ్రాకు వచ్చే హక్కు లేదు

అనంతపురం కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రధానికి మోదీకి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించే హక్కు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖపట్నం పర్యటనను నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆ ధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగ య్య, సావిత్రమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామాంజినేయులు, వెంకటనారాయణ, పరమేష్, నాగరాజు పాల్గొన్నారు.

మూడు గ్రామాల రోడ్డుకు మహర్దశ

● ఎట్టకేలకు కబ్జా నుంచి దారికి విముక్తి



సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

పెనుకొండ టౌన్, జనవరి (ఆంధ్రజ్యోతి): పూర్వము నుంచి రికార్డుల ప్రకారం ఉన్న దారిని మూసివేయడంతో గ్రామాల ప్రజల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ప్రస్తుతం అదే దారిని యథావిధంగా రాకపోకలకు వినియోగంలో తెచ్చి ప్రజలచే శబాష్ ఆఫీసర్స్ అనిపించుకుంటున్న పలు శాఖా అధికారులు. పెనుకొండ పట్టణం నుంచి కోనాపురం, మంగాపురం, కొండాపురం గ్రామాలకు వెళ్లే దారి సర్వేనంబర్ 681 నందు 12 అడుగులు రికార్డుల్లో ఉంది. ఈ దారిని పలువురు ఆక్రమించుకొని అదనంగా మరో దారిని ఏర్పాటుచేశారు. అప్పట్లో యదావిధంగా దారిని ఏర్పాటుచేయాలని ప్రజలు ఆందోళన చేపట్టారు. వైసీపీ నేతల అండదండలు రియల్టర్లకు పుష్కలంగా ఉండటంతో అప్పట్లో అధికారులు చర్యలకు వెనుకంజ వేశారు. మరోమారు ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాధులు రావడంతో రెవెన్యూ, నగరపంచాయతీ అధికారులు చర్యలకు పూనుకున్నారు. నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అధికారులు నీతినిజాయితీగా పనిచేస్తూ దారి ఏర్పాటుచేయడంతో మంగళవారం సీసీ రోడ్డు కూడా ఏర్పాటుచేశారు. దీంతో మూడు గ్రామాల ప్రజల రాకపోకలతో పాటు నారాయణమ్మ కాలనీ, డిగ్రీ కళాశాల, మరో ప్రైవేటు కళాశాలకు వెళ్లే వారికి ఇబ్బందులు తగ్గాయి. ఏది ఏమైనా కబ్జా కోరల దారికి విముక్తి కలిగించి రోడ్డు ఏర్పాటుచేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

మడకశిర రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ మంజువాణి తెలిపారు. మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటానిమో వైరస్) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సి పని లేదని, అయినా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓపీ కౌంటర్ల వద్ద శానిటైజర్లు ఉండాలని, శ్వాసకోశ సమస్యలతో వచ్చే కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలో ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, ఫార్మసిస్ట్ కాంతరాజ్, ఆరోగ్యకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై దాడికి వ్యతిరేకంగా ర్యాలీ



దాడికి నిరసనగా తహసీల్దార్‌కు వినతి అందిస్తున్న విలేకరులు

పావగడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గడినాడు మిత్ర పత్రికా విలేకరి రామంజినప్పపై కొందరు వ్యక్తులు దాడి చేసిన సంఘటనను ఖండిస్తూ కర్నాటక వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు పావగడ పట్టణంలో మంగళవారం పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నుంచి శనిమహాత్మా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఒక భూ వివాదానికి సంబంధించి పత్రికలో వార్త రాసినందుకు వ్యాపారి కుటుంబ సభ్యులతో కలిసి టోల్‌గేట్‌లోని శ్రీరాం మెడికల్స్ ముందర ముగ్గురు మహిళలతో విలేకరి రామాంజినప్పపై దాడి చేయించడం ప్రజా స్వామ్యానికి పత్రికా రంగానికి తీవ్ర అవమానమన్నారు. దాడిని విలేఖరుల సంఘం గౌరవ అధ్యక్షులు ప్రసన్నమూర్తి, హనుమంతరాయప్ప, కార్యదర్శి వడ్డె శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. దాడి విషయాన్ని తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ మరియప్ప, అబ్దుల్ ఖాదర్‌లు డిఓఎస్పీ శేఖర్, పావగడ సీఐ సురేష్ తీవ్రంగా తనిఖీ చేపట్టి దాడికి పాల్పడిన ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని బెంగళూరు జైలుకు తరలించారు.

గడినాడు పత్రికా విలేఖరి రామాంజినప్పపై రియల్ వ్యాపారి తన బంధువులతో కలిసి చేసిన దాడిని కురుబ కులస్తులు తీవ్రంగా ఖండించారు. పావగడ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని అనేక మందిపై దాడులకు పాల్పడుతున్న నిందితుడిపై రౌడి షీట్ ఓపెన్ చేసి రాష్ట్ర బహిష్కరణ చేయాలని పోలీస్ స్టేషన్ ముందు పెదద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన మహిళలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నాయీబ్రాహ్మణ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సోమందేపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర కల్యాణమండపంలో నాయీబ్రాహ్మణులు సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా మనోహర్, ఉపాధ్యక్షుడిగా నరసింహమూర్తి, కార్యదర్శిగా ఆరవింద్, కోశాధికారిగా కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బాబయ్య, కుళ్లాయప్ప, నారాయణప్ప, శ్రీనివాసులు, సంజీవరాయుడు, అశ్వత్థప్ప, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెనుకొండ రూరల్, జనవరి7(ఆంధ్రజ్యోతి): రొద్దం మండంలోని రెడ్డిపల్లిలో నరసప్ప (32) మంగళవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాల మేరకు.. రెడ్డిపల్లికి చెందిన నరసప్ప తల్లిదండ్రులు ఇదివరకే మరణించారు. నరసప్ప కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. జీవితం మీద విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని, మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పెనుకొండకు తరలించారు.

బెల్ట్ షాపులపై విజిలెన్స్ దాడులు

చిలమత్తూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొన్ని చోట్ల ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రాత్రి బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు.. ఈ సందర్భంగా చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై దాడులు చేశారు. ఈ దాడుల్లో మద్యం పట్టుపడింది. ఇది కర్ణాటక మద్యమా? నకిలీ మద్యమా అనేది ఎక్సైజ్ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఎక్సైజ్ అధికారుల దాడుల విషయం తెలుసుకున్న మరికొంత మంది బెల్టు షాపుల నిర్వాహకులు అలర్ట్ అయ్యారు. దాడుల్లో పట్టుబడిన మద్యం వైసీపీకి చెందిన ఓ నాయకుడు తెప్పించి గ్రామాల్లో బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బెల్టు షాపులకు మద్యం సరఫరాలో మరెవరిదైనా ప్రమేయం ఉందా అనేది ఎక్సైజ్ అధికారులు తేల్చాల్సి ఉంది. ఈ దాడుల్లో పది కేసుల వరకు మద్యం పట్టుబడినట్లు తెలిసింది.

పేరుకుపోయిన చెత్త



మార్కెట్‌యార్డు వద్ద చెత్తలో సంచరిస్తున్న పందులు

మడకశిరటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీల్లో చెత్త ఎత్తకపోవడంతో ఎక్కడికక్కడ కుప్పలు తెప్పలుగా పేరుకుపోతోంది. ఆపరిసర ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు సైతం అధికంగా ప్రబలుతున్నాయి. పట్టణంలోని మధుగిరి సర్కిల్, మార్కెట్ పక్కనే ప్రధాన రహదారికి ఆనుకొని గత నాలుగైదు రోజుల నుండి చెత్త శుభ్రం చేయకపోవడంతో చెత్త అంతా రోడ్డుపైకే వస్తోంది. దీంతో ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. చెత్తలో పందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. తాజ్‌క్లినిక్, ఎస్సీ కాలనీ, సాయిబాబా గుడి పరిసర ప్రాంతాలతోపాటు శివాపురం, తదితర కాలనీల్లో రోజూ చెత్తను శుభ్రం చేయకపోవడం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. అందులో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపైకి వస్తున్నాయి. దీంతో సమస్య జటిలమవుతోంది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు చెత్తను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మండల కార్యవర్గం ఎన్నిక

సోమందేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకుల ఎన్నిక మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశభవనంలో జరిగింది. అధ్యక్షుడిగా పందిపర్తి పంచాయితీ ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్, ఉపాధ్యక్షుడిగా గుడిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ కిషోర్ ఎన్నికయ్యారు. నూతన నాయకులకు ఏపిఓ సోమశేఖర్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీఏలు పీఓలు ఫీల్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ

నల్లమాడ, జనవరి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్మికు లకు 20 మందికి టీడీపీ సామటి కోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, ఆంజనమ్మ, ఎస్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

మధ్యంతర భృతి చెల్లించాలి

పెనుకొండ రూరల్, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు మధ్యంతర భృతి ప్రకటించాలని కోరుతూ ఏపిఎస్‌టిఏ యూనియన్ నాయకులు ఎంఈఓ జయభాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం రొద్దం ఉన్నత పాఠశాలలో క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూనియన్ ముందుండాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర, ఆదినారాయణ పాల్గొన్నారు.

వృథాగా పోతున్న నీరు



పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

మడకశిరటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మధుగిరి రోడ్డు మారుతీనగర్‌లో నీటి సరఫరా చేస్తున్న పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా వెళుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారి పక్కనే మారుతీనగర్‌కు సరఫరా అవుతున్న నీటిపైపు పగిలిపోవడంతో ఉదయం నుండి నీరంతా వృథాగా వెళుతున్నాయి. చిన్న చిన్న మరమ్మతులను సైతం అధికారులు చేయించకపోవడంతో తరచూ నీరు సమస్య ఉత్పన్నమవుతోంది. గత వారం రోజుల క్రితం మారుతీనగర్‌లో గేట్‌వాల్ విరిగిపోవడంతో వాటి మరమ్మతులకు వారం రోజుల సమయం పట్టింది. దీంతో నీటి సమస్య అధిక మవుతోంది. బుధవారం పైప్‌లైన్ పగిలిపోవడంతో ఎన్నాళ్లకు మరమ్మతులు చేయిస్తారో అన్న ఆందోళన కాలనీ వాసులు వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో సైతం మోటారు మరమ్మతుకు గురైన పది రోజులు గడుస్తున్నా మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు చిన్న చిన్న మరమ్మతులు చేయించి సమస్య ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏర్పాట్ల పరిశీలన



ఇజ్‌తెమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మోతుకపల్లి వద్ద ఇజ్‌తెమా సందర్భంగా మంగళవారం ఏర్పాట్లను టీడీపీ నాయకులు పరిశీలించారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పావులూరు శ్రీనివాసరావు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, కౌన్సిలర్ రమేష్, నాయకులు ఆర్ఎంఎస్ షఫీ, డైమండ్ బాబా, అమీన్, పాజిల్, నజీర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇజ్‌తెమా నిర్వహణకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మందులు అవసరమైతే ఇస్తామన్నారు. వీరి వెంట బాచీ, అమరనాథ్, ముతవల్లీలు, మైనార్టీ నాయకులు ఉన్నారు.

రాగి సాగుపై రైతులకు అవగాహన

పరిగి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఊటుకూరు, బీచిగానపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ అధికారి విజయ భారతి ఆధ్వర్యంలో మంగళవారం రాగి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ రాగి పంటను సాగు చేస్తే క్వింటాలు రాగులకు ప్రభుత్వ రూ.4290 మద్దతు ధర కల్పిస్తుందన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఓబుళదేవరచెరువు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరప్పగారిపల్లి గ్రామంలో కర్నాటక మద్యం అమ్ముతున్న దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు. వారి నుంచి 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఘనంగా వేమన సంతర్పణ

గాండ్లపెంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి శ్రీయో గి వేమన ఆలయంలో సంతర్పణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన సమాధిని ప్రత్యేకంగా అలం కరించారు. గొడుగుల మెరవన, కత్తిసాము, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.